సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 16 । జూన్ । 2024



ఇద్దరికి రిమాండ్

డబ్బు కోసం మేనమామను హత్య చేసిన అల్లుడు, సహకరించిన అతడి స్నేహితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 8లో▸



యువకుడి హత్య కేసులో ..

యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటనలో నలుగురు నిందితులను బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో▸



క్షీరాభిషేకం

గ్రామీణ వైద్యులపై ముఖ్యమంత్రి నిర్ణయాన్ని హర్షిస్తూ తుర్కయంజాల్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 8లో▸

ధరణి.. మళ్లీ స్పెషల్



యాచారం తహసీల్దార్ కార్యాలయంలో భూ సమస్యలపై నివేదిక తయారు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- మరోసారి స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధం
- నేటి నుంచి మూడు రోజుల పాటు నివేదికల తయారీ
- జిల్లాలో 28 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్
- ఈసారైనా మోక్షం కలిగేనా?

సాక్షి, రంగారెడ్డిజిల్లా/యాచారం: ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మళ్లీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. నేటి నుంచి మూడు రోజుల పాటు ఆయా రెవెన్యూ కార్యాలయాల్లోనే ఉండి నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ శశాంక ఆదేశాలు జారీ చేశారు. దీంతో తహసీల్దార్లు, ఆర్డీఓలు పెండింగ్‌లో ఉన్న ధరణి దస్త్రాలను దులిపే పనిలో శనివారమే నిమగ్నమయ్యారు. ఆది, సోమ, మంగళ వారాల్లో నివేదికలు తయారు చేసి, వారం రోజుల్లోనే సమస్యలన్నీ పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ధరణి పోర్టల్‌లో జిల్లా వ్యాప్తంగా 28వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో 27,166 కలెక్టర్ లాగిన్‌లో ఉండి పోయాయి. వరుస ఎన్నికలకు తోడు కలెక్టర్ల బదిలీలు, క్షేత్రస్థాయి నుంచి రిపోర్టుల జాప్యం కారణంగా ఆరు నెలల నుంచి ఒక్క దరఖాస్తు కూడా పరిష్కారానికి నోచుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే రెండు విడతల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. పోర్టల్‌లోని కొన్ని అంశాలను కలెక్టర్ నుంచి తహసీల్దార్లు, ఆర్డీఓలకు బదిలీ చేసింది. సార్వత్రిక ఎన్నికలు కూడా ముగియడంతో మళ్లీ ఈ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది.

ఏ జాబితాలో ఎన్నంటే..

- జిల్లా వ్యాప్తంగా 2,915 మంది మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా, వీరిలో అత్యధికంగా మొయినాబాద్‌లో 355, అతి తక్కువగా హయత్‌నగర్‌లో ఒకరు ఉన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్, చేవెళ్ల, గండిపేట్, ఫరూఖ్‌నగర్, ఇబ్రహీంపట్నం, కందుకూరు, మహేశ్వరం, నందిగామ, షాబాద్, శంషాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో 100పైగా దరఖాస్తుదారులు ఉన్నారు.
- సక్సేషన్ కోసం 1,120 మంది దరఖాస్తు చేసుకుంటే వీటిలో చేవెళ్ల, ఇబ్రహీంపట్నంలో వందకుపైగా, అబ్దుల్లాపూర్‌మెట్, కందుకూరు, కేశంపేట, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో 50పైగా పెండింగ్‌లో ఉన్నాయి.
- నిషేధిత జాబితాలో 6,295 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. అబ్దుల్లాపూర్‌మెట్, బాలాపూర్, ఫరూక్‌నగర్, గండిపేట్, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, కందుకూరు, మహేశ్వరం, మొయినాబాద్ మండలాల్లో 200పైగా ఉన్నాయి. తలకొండపల్లి, చౌదరిగూడ, ఆమనగల్లు మండలాల్లోనూ పదుల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి.
- కోర్టు కేసులకు సంబంధించి షాబాద్, ఇబ్రహీంపట్నం, కందుకూరు, మొయినాబాద్, మహేశ్వరం, యాచారం, మండలాల్లో 1,788 వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.
- టీఎం 33కి సంబంధించిన దరఖాస్తులు 16,233 వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో నోటీసు జనరేట్ కానివి 7,194 వరకు ఉన్నాయి. ఇక నోటీసు జనరేట్ అయి కలెక్టర్ అనుమతి కోసం 8,707 ఉన్నాయి.
- సీసీఎల్ఏలో మరో 332 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

దరఖాస్తులు ఇలా..

మ్యుటేషన్స్	2,915
సక్సేషన్	1,120
నిషేధిత జాబితా	6,295
కోర్టు కేసులు	1,788
టీఎం-33	16,233

రెవెన్యూ డివిజన్ల వారీగా..

భూ సమస్యల అంశాన్ని కలెక్టర్ శశాంక సీరియస్‌గా తీసుకున్నారు. రెవెన్యూ సిబ్బంది అంతా ఆది, సోమవారాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లోనే ఉండి నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. మంగళవారం నుంచి కలెక్టర్ కార్యాలయంలో గుర్తించిన భూ సమస్యలను అక్కడే తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ లాగిన్ల ద్వారా పరిష్కరించనున్నారు. తొలి రోజులో భాగంగా ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్‌ను ఎంచుకున్నారు. వారం రోజుల పాటు ఆర్డీఓ, ఆయా మండలాల తహసీల్దార్లు, ఆర్ఐలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే ఉండి సమస్యలన్నింటినీ పరిష్కరించనున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ డివిజన్లలోని భూ సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. రైతు ఫోనుకు ఆ వెంటనే సమాచారం వెళ్లనుంది. ఏ అడ్డంకులు లేని భూ సమస్యలను సత్వరమే పరిష్కరించి కోర్టు కేసులు, ఇతర ఫిర్యాదులున్న భూ సమస్యలను పరిష్కరించే విషయంలో చట్టాన్ని పరిగణనలోకి తీసుకోనున్నారు. స్పెషల్ డ్రైవ్ దృష్ట్యా శనివారం ఆయా మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్లు, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్‌లు భూ సమస్యలపై నివేదికలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

న్యూస్‌రీల్

అక్రమ వెంచర్‌పై కొరడా



జేసీబీ సాయంతో వెంచర్‌లోని రోడ్డును ధ్వంసం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుర్కయంజాల్: అక్రమ వెంచర్‌పై మున్సిపల్ అధికారులు శనివారం కొరడా ఝులిపించారు. తుర్కయంజాల్ రెవెన్యూ రాగన్నగూడలో సర్వే నంబర్ 338లో చేపడుతున్న అక్రమ వెంచర్‌లోని రోడ్లు, ఇతర నిర్మాణ పనులను అధికారులు జేసీబీ సాయంతో తొలగించారు. పురపాలక సంఘం పరిధిలోని పలు సర్వే నంబర్లలో చేపడుతున్న అక్రమ వెంచర్లు, నిర్మాణాలను తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాసులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

పూర్ణా మలావత్



మాట్లాడుతున్న పూర్ణా మలావత్

మీర్‌పేట: మగవారికి దీటుగా ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని మౌంట్ ఎవరెస్ట్ అధిరోహించిన పూర్ణా మలావత్ అన్నారు. జిల్లెలగూడ లార్డ్స్ పాఠశాలలో శనివారం నూతన విద్యాసంవత్సరం ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ద్దేశించి మాట్లాడారు. తాను 13 ఏళ్ల నుంచే కొండలను ఎక్కడం నేర్చుకుని సాధన చేయడం వల్లే మౌంట్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించగలిగానని తెలిపారు. భువనగిరితో పాటు ఇతర చోట్ల చిన్నారులకు ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. అనంతరం ఆమెను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సిద్ధాల బీరప్ప, డైరెక్టర్ సిద్ధాల శ్రీలత, ప్రిన్సిపాల్ మరియస్ మధాను పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి



సిబ్బందితో మాట్లాడుతున్న అధికారి

కడ్తాల్: గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలని, ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా సహాయ గిరిజన అభివృద్ధి అధికారి (ఏటీడీఓ) ఉడుతనూరి వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం, ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. వసతిగృహంతో పాటు పాఠశాల తరగతి గదులు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, బెడ్‌షీట్స్, కార్పెట్స్, రెండు జతల దుస్తులు, నోట్‌బుక్స్ అందించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో 3 నుంచి 10 వతరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లాలోని గిరిజన సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన వంట సామగ్రిని ఆయా వసతి గృహాల సంక్షేమ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారులు రాములు, బాలరాజు, రాంచంద్రయ్య, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకోసం ఈ నెల 17 నుంచి 23 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. అర్హత కలిగిన ఎస్టీ అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 70935 51966, 97055 30720 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

చేవెళ్ల ఆస్పత్రిలో మంటలు



ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన పేషెంట్లు (ఇన్ సెట్‌లో) ఆస్పత్రిలో చెలరేగుతున్న మంటలు

- డయాలసిస్ కేంద్రంలో షార్ట్‌సర్క్యూట్
- అప్రమత్తమైన సిబ్బంది
- తప్పిన పెను ప్రమాదం

చేవెళ్ల: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. సిబ్బంది అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. శనివారం రాత్రి 7.30 గంటల సమయంలో ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో ఇన్వర్టర్ వద్ద షార్ట్‌సర్క్యూట్ కావటంతో దానిపైనే ఉన్న ఫైల్స్, కాగితాలకు మంటలు అంటుకున్నాయి. మంటలతో వార్డులోని విద్యుత్ వైర్లు కాలిపోవడంతో దట్టమైన పొగ, వాసన ఆస్పత్రి మొత్తం వ్యాపించింది. రాత్రి సమయం కావడం.. డయాలసిస్ పేషెంట్లు లేక పోవడంతో ఆ గదికి తాళం వేసి ఉంది. అదే వార్డు పక్కనే ఉన్న డెలివరీచేసే గదిలో ఓ పెషెంట్ డెలివరీ కావటంతో అక్కడే ఉన్న వైద్య సిబ్బంది వాసన, పొగ చూసి అప్రమత్తమయ్యారు. వెంటనే పోలీసులు, ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. ఈలోగా డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి వచ్చి తాళం పగులగొట్టి అందులో ఉన్న ఫైర్ ఎక్స్‌మిషర్ (మంటలను ఆర్పే పరికరం)తో మంటలను ఆర్పివేశాడు. అప్పటికే పలు ఫైళ్లు, వైర్లు కాలిపోయాయి. విద్యుత్ అధికారులు, పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంటనే ఆస్పత్రికి చేరుకున్నారు. విద్యుత్ సరఫరా నిలిపేసి ప్రమాదం జరిగిన కేంద్రంలో పరిశీలించారు. ఆస్పత్రిలో అంతర్గత విద్యుత్ వైరింగ్ సక్రమంగా లేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

పేషెంట్లు బయటకు పరుగులు

ఆస్పత్రిలో ప్రమాదం జరిగిన సమయంలో ఇన్ పేషెంట్లు ఎక్కువగా లేరు. బాలింతలు, కాన్పుకోసం వచ్చిన గర్భిణులు, అప్పుడే డెలివరీ అయిన పేషెంట్లు మాత్రమే ఉన్నారు. ఆస్పత్రిలో ప్రమాదంతో కరెంట్ సరఫరా నిలిచి పోవటంతోపాటు పొగ, వాసన వస్తుండటంతో వారంతా ఆస్పత్రి బయటకు పరుగులు తీశారు. మంటలు ఆర్పివేసిన తర్వాతో ఆస్పత్రిలోని మరో వార్డులో పేషెంట్లను ఉంచారు. ఆస్పత్రిలో ఎక్కువ మంది పేషెంట్లు లేక పోవడం, వెంటనే సిబ్బంది అప్రమత్తం కావడంతో పెనుప్రమాదం తప్పింది.

అభివృద్ధి కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తాం

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం భ్రష్టుపట్టిందని మండిపాటు



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: అభివృద్ధి విషయంలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఎంపీగా గెలిచిన తర్వాత శనివారం తొలిసారిగా శంకర్‌పల్లికి వచ్చిన ఆయనకు పార్టీశ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం ఓ ప్రైవేటు గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనను భారీ మెజార్టీతో గెలిపించిన ఈ ప్రాంత ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం భ్రష్టు పట్టిపోయిందని మండిపడ్డారు. అధికార దుర్వినియోగం, భూ కబ్జాలకు పాల్పడిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిందని ధ్వజమెత్తారు. ఈసారి అలా కాకుండా కేంద్రం నుంచి వచ్చే నిధులతో చేపట్టే పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తామన్నారు. ఎంఎంటీఎస్ రైలును వికారాబాద్ వరకు తీసుకొచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేసే వారికి టికెట్లు ఇస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బొక్క నర్సింహారెడ్డి తదితరులు

అక్రమ బదిలీలపై విచారణ జరిపించండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల అక్రమ బదిలీలతో డీఈఓ, బీఈఓ చేసిన జిల్లాకు చెందిన నిరుద్యోగులు అన్యాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో నంబర్ 610తో స్థానికేతరులకు న్యాయం జరిగిందని, స్థానికులకు అన్యాయం జరిగిందన్నారు. జీవో 317 ప్రకారం క్యాడర్ స్ట్రెంత్, వర్కింగ్ పొజిషన్, వేకెన్సీ పొజిషన్ షెడ్యూలు కులాలు, తెగలకు సంబంధించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ కేటాయింపులు చేయాల్సి ఉందన్నారు. కానీ జిల్లాలో ఈ నిబంధనలు పక్కన పెట్టి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, మంచిర్యాల, యాదాద్రి, సంగారెడ్డి ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులను బదిలీ చేశారని మండిపడ్డారు. రూల్స్ పాటించకపోవడంతో ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. 400కుపైగా ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోకి ప్రవేశించారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేష్, నాయకులు లక్ష్మీపతిగౌడ్, అశోక్‌గౌడ్, శ్రీశైలం పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు శుభాకాంక్షలు



మల్లు భట్టివిక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పుట్టిన రోజును పురస్కరించుకొని శనివారం సచివాలయంలో ఆయనను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. టీపీసీసీ సభ్యుడు మహ్మద్ అలీఖాన్‌బాబర్‌తో కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు.

పాలు పారబోసి నిరసన

బిల్లులు సకాలంలో రావడం లేదని పాడి రైతుల ఆందోళన




జాతీయ రహదారిపై పాలు పారబోసి నిరసన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు

కడ్తాల్: విజయడెయిరీ సేకరిస్తున్న పాలకు సకాలంలో బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పాడి రైతులు రోడ్డుపై పాలు పారబోసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో విజయ డెయిరీ పాడి రైతుల నుంచి పాలను సేకరిస్తోంది. రెండు నెలలుగా బిల్లులు రావడం లేదని నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై పాలను పారబోసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. పాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని పలుమార్లు తెలంగాణ పాడి పరిశ్రామిభివృద్ధి సహకార సమాఖ్య అధికారులను కలిసి విన్నవించామని అయినా స్పందన లేదని మండిపడ్డారు. పాఠశాలలు ప్రారంభం కావడంతో పిల్లల ఫీజులు, ఇటీవల కురిసిన వర్షాలకు విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఉపయోగపడతాయనుకుంటే పాల బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అసలే పాడి పోషణ భారంగా మారిందని, ఆపై ఖర్చులు పెరగడంతో మరింత భారమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి సకాలంలో బిల్లులు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ రాధికను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాడి రైతుల సంఘం నాయకులు కదారి రామకృష్ణ, సుధాకర్, కృష్ణయ్య, కోసికే వెంకటేశ్, జంగయ్య, మహేశ్, చంద్రయ్య, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి బలవన్మరణం

ఆర్థిక ఇబ్బందులా.. మరేదైనా కారణమా..?



నరేంద్ర (ఫైల్)

ఇబ్రహీంపట్నం: బీటెక్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐలు రామకృష్ణ, మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం, మామునూర్ గ్రామానికి చెందిన సంగెపు నరేంద్ర (27) ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఆదిబట్ల ఏరోస్పేస్‌లో పార్ట్ టైం జాబ్ చేస్తూ ఇబ్రహీంపట్నం ఎంబీఆర్ నగర్‌లోని ఎస్‌వీ బాయ్స్ హాస్టల్ ఉంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి హాస్టల్ రెండో అంతస్తులోని తన గదిలో బెడ్ షీట్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. షాపింగ్ కోసం నగరానికి వెళ్లిన రూం మేట్స్ వచ్చి చూసేసరికి విగతజీవిగా మారి కనిపించాడు. దీంతో వారు హాస్టల్ యజమాని వేణుకు సమాచారం ఇచ్చారు. వెంటనే మృతుని కుటుంబసభ్యులు, పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. మృతుని తండ్రి రాంబాబు, బంధువులు శనివారం ఉదయం హాస్టల్‌కు చేరుకుని బోరున విలపించారు. తమకు ఎవరిపైనా అనుమానం లేదని, ఆర్థిక ఇబ్బందులు కారణం కావచ్చని తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కాగా నరేంద్ర మొబైల్ ఫోన్ లాక్ ఓపెన్ కాలేదు. కాల్ డేటాను పరిశీలిస్తే ఆత్మహత్యకు ప్రేరేపించిన కారణాలు ఆర్థిక ఇబ్బందులా లేక మరేమైనా ఉన్నాయా అనేది స్పష్టమయ్యే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

'ఉపాధి' సమస్యలు పరిష్కరించండి

వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య



సదస్సులో మాట్లాడుతున్న కాంతయ్య

షాద్‌నగర్‌రూరల్: ఉపాధిహామీ చట్టంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య విమర్శించారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శనివారం వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బుద్దుల జంగయ్య ఆధ్వర్యంలో 'ఉపాధి కూలీల సమస్యలు–పరిష్కార మార్గాలు' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కాంతయ్య మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం తీసుకురావాలని వామపక్ష పార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పోరాటం చేశాయని అన్నారు. ఆ పోరాట ఫలితంగానే 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టానికి రూపకల్పన చేసిందని గుర్తు చేశారు. అనంతరం ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో రోజురోజుకూ నిర్వీర్యం అవుతున్న పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు అన్ని వసతులు కల్పించాలని, కూలీల సమస్యల పరిష్కారంకోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ.. ఉపాధికూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, పని చేసే ప్రదేశంలో కూలీ మరణిస్తే రూ.5లక్షలు, 55 ఏళ్లు నిండిన కూలీలకు రూ.5వేల పెన్షన్, రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా నాయకుడు వెంకటేశ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కదులుతున్న రైలు దిగి మహిళ దుర్మరణం

శంకర్‌పల్లి: కదులుతున్న రైలు దిగిన మహిళ మృతి చెందింది. ఈ ఘటన శంకర్‌ల్లి రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే ఎస్‌ఐ శంకరయ్య తెలిపిన ప్రకారం.. వికారాబాద్ నుంచి గుంటూరు వెళ్తున్న పల్నాడు ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.15గంటలకు శంకర్‌పల్లి చేరుకుంటోంది. ఈ సమయంలో ఆ రైలు ఆగక ముందే గుర్తు తెలియని ఓ మహిళ(45) దిగేప్రయత్నం చేయగా చేతులు, తల పట్టాలపైకి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు, స్టేషన్ సిబ్బంది సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవంతో గుర్తు తెలియని మహిళగా కేసు నమోదు చేసుకుని శవాన్ని వికారాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేస్తాం

మేయర్ లతా ప్రేమ్‌గౌడ్



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేస్తామని మేయర్ లతాగౌడ్ అన్నారు. శనివారం రూ.2.12 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు 7,16,18వ డివిజన్‌లలో మేయర్ లతాగౌడ్ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో కావలసిన మౌలిక సదుపాయాలు, పెండింగ్‌లోని పనులు, నిర్మాణ దశలో ఉన్న పలు అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు పుష్ప, పద్మావతియాదవ్, శ్రీలతగౌడ్ నాయకులు ప్రేమ్‌గౌడ్, గోపాల్ ముదిరాజ్, టింకురెడ్డి పాల్గొన్నారు.

స్నేహితుడి మృతికి కారణమైన వ్యక్తులకు రిమాండ్

శంకర్‌పల్లి: పందెం కాసి స్నేహితుడి మృతికి కారణమైన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన శనివారం శంకర్‌పల్లి ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. ఈ నెల 1న చెందిప్ప గ్రామానికి సురేందర్, మల్లేశం, మాణిక్యం ముగ్గురు స్నేహితులు ఊరి బయటకి వెళ్లి సరదాగా మాట్లాడుకుంటూ కూర్చున్నారు. పురుగు మందు తాగితే రూ.లక్ష ఇస్తామని మల్లేశం, మాణిక్యం పందెం వేశారు. ఇందుకు స్పందించిన సురేందర్ పురుగు మందు తాగి ఆస్పత్రి పాలయ్యాడు. ఉస్మానియాలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం మృతి చెందగా.. కుటుంబసభ్యుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సురేందర్ మృతి కారణమైన ఇద్దరు స్నేహితులు మల్లేశం, మాణిక్యంలను శనివారం శంకర్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వారిని చేవెళ్ల మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. 14రోజుల రిమాండ్ నిమిత్తం సంగారెడ్డి జిల్లా కంది జైలుకి పంపారు.

ఆలయంలో చోరీకి యత్నం

నందిగామ: పట్టపగలే అయ్యప్ప ఆలయంలో ఇద్దరు దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. ఈ ఘటన నందిగామ శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. నందిగామ శివారులో పాత జాతీయ రహదారి పక్కనున్న అయ్యప్ప ఆలయంలో ఇద్దరు దుండగులు హుండీని పగులగొట్టారు. అలికిడి విన్న స్థానికులు వారిని పట్టుకునేందుకు యత్నించగా ఒకరు పారిపోగా యోగేశ్‌రావు సాహుబ్ సంగారే పట్టుబడ్డాడు. నిందితుడిని పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.

మేనమామ హత్యకేసులో ఇద్దరికి రిమాండ్



చేవెళ్ల: కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్

పరారీలో మరో నిందితుడు

- స్కూటీ, కత్తి, రెండు సెల్‌ఫోన్లు సీజ్

చేవెళ్ల: డబ్బు కోసం మేనమామను హత్య చేసిన అల్లుడు ఇందుకు సహకరించిన అతడి స్నేహితుడిని చేవెళ్ల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. తంగడపల్లికి చెందిన రుల్లాఖాన్ అలియాస్ సలీంఖాన్ కుటుంబం 15 ఏళ్లుగా హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌లో నివాసం ఉంటున్నారు. మృతుడికి, అతని అన్న అన్వర్‌ఖాన్‌కు కలిపి తంగడపల్లిలో కొంత వ్యవసాయ భూమి ఉంది. నగరంలోని జీర్రాలో ఉండే వీరి అక్క కొడుకు ఖాజాపాషా కొన్నాళ్లుగా భూమిలో వాటా అడుగుతున్నాడు. ఇదే విషయంలో ఎనిమిది నెలల క్రితం పంచాయితీ పెట్టగా అన్వర్‌ఖాన్ భూమికి బదులుగా రూ.14లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. చిన్న మామ రుల్లాఖాన్ రూ.2లక్షలు ఇస్తాననగా ఎక్కువ డబ్బు డిమాండ్ చేశాడు. అందుకు ఆయన నిరాకరించడంతో ఎలాగైనా అంతమొందించాలని ఖాజాపాషా నిర్ణయించుకున్నాడు. ఈ నెల 13న గ్రామంలో ఒంటరిగా ఉంటున్న మేనమామ దగ్గరకు అతని స్నేహితుడు, ఆటో డ్రైవర్ షేక్ ముస్తాఫా, దారుసలాంలో ఉండే అప్సర్‌తో కలిసి స్కూటీపై వచ్చారు. రాత్రి ఇదేవిషయం మాట్లాడగా పొద్దున మాట్లాడుకుందాం పడుకోండి అని చెప్పాడు. పథకం ప్రకారం పడుకున్నట్లు నమ్మించి ఖాజాపాషా వెంట తెచ్చుకున్న కత్తితో మేనమామ కడుపులో పొడిచి హత్య చేశాడు. స్నేహితుడు ముస్తాఫా నోరు మూయగా విచక్షణారహితంగా పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం వారు ముగ్గురు స్కూటీపై వెళ్తుండగా గ్రామస్తులు అనుమానంతో వెంబడించగా బండి వదిలి పారిపోయారు. ఉదయం హత్య ఉదంతం తెలియడంతో రాత్రి వచ్చిన వారే అయి ఉంటారని పోలీసులకు స్కూటీని చూపారు. దీంతో కేసు విచారణ ప్రారంభించిన పోలీసులు ఖాజాపాషాను, ముస్తాఫాను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. మరో నిందితుడు అప్సర్‌ఖాన్ పరారీలో ఉన్నాడు. ఇద్దరు నిందితులకు రిమాండ్‌కు తరలించి హత్యకు ఉపయోగించిన స్కూటీ, కత్తి, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేశామన్నారు.

యువకుడి హత్య కేసులో నలుగురి అరెస్ట్



పహాడీషరీఫ్: పోలీసుల అదుపులో నిందితులు

పహాడీషరీఫ్: యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటనలో నలుగురు నిందితులను శనివారం బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ భూపతి తెలిపిన ప్రకారం.. చాంద్రాయణగుట్ట హఫీజ్‌బాబానగర్‌కు చెందిన సయ్యద్ మునీర్ కుమారుడు సయ్యద్ సమీర్(19) కారు డ్రైవర్, దే కాలనీకి చెందిన మహ్మద్ సోహెల్(20) ఇటీవల గొడవపడ్డారు. అప్పటి నుంచి సమీర్‌పై కోపం పెంచుకున్న సోహెల్ ఎలాగైనా అంతమొందించాలనుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 13న రాత్రి 11గంటల సమయంలో సమీర్ ఇంటి సమీపంలో కమ్యూనిటీ హాల్ వద్ద ఉండగా సోహెల్ స్నేహితుడు మైనర్ బాలుడితో కలిసి కిడ్నాప్ చేశారు. ఇరువురూ స్కూటీపై సమీర్‌ను బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయకల్ కాలనీ గుర్రం చెరువు పరిసరాలకు తీసుకెళ్లి ఛాతి, వీపు, నడుము భాగాల్లో కత్తితో పొడిచారు. రక్తపు మడుగులో కుమారుడు పడిఉన్న విషయాన్ని సమీర్ తండ్రి మునీర్ తెలిసింది. వెంటనే ఆయన చికిత్స నిమిత్తం ఒవైసీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు సోహెల్, మైనర్ బాలుడితో పాటు కేసులో పరోక్షంగా ప్రమేయమున్న మహ్మద్ అబ్దుల్ గౌస్ అలియాస్ ఖాలేద్(20), మహ్మద్ అర్బాజ్(20)ను అరెస్ట్ చేశారు. మైనర్‌ను జువైనల్ హోంకు తరలించారు. ఈ విలేకరుల సమావేశంలతో ఎస్ఐ మహేందర్, సైదులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన ఆర్‌ఎంపీలు

తుర్కయంజాల్: గ్రామీణ వైద్యులపై అధికారులు దాడులను ఆపాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లేపల్లి శ్రీనివాసరాజు కోరారు. అధికారులు, పోలీసులు గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స అందిస్తున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వివరించామన్నారు. ఇందుకు స్పందించిన ముఖ్యమంత్రి సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ సంగీతతో మాట్లాడి దాడులు చేయవద్దని చెప్పినట్లు వివరించారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని హర్షిస్తూ శనివారం తుర్కయంజాల్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ వైద్యులకు శిక్షణను ఇచ్చినట్లు వారు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి ఉపేందర్, సభ్యులు రమేశ్, జయప్రకాశ్, శంకర్, జింతేదర్, వెంకటేశ్వర రావు, ప్రవీణ్ సింగ్, నరేశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



అంజి (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఏఎస్ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం చెన్నాయపల్లి తండాకు చెందిన రవి నాయక్, అంజి దంపతులు షాద్‌నగర్‌కు వలసొచ్చారు. పట్టణంలోని సాంబశివ కాలనీలో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 8న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అంజి తిరిగి రాలేదు. ఆమె భర్త ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యమవ్వలేదు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించాడు. మహిళ ఆచూకీ తెలిసినా, వివరాలు తెలిసినా పోలీస్‌స్టేషన్‌లోగాని 9849163374, 9182773308 నంబర్లలో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

విధులకు వెళ్లిన సెక్యూరిటీ గార్డు..



సుధీర్ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: విధులకు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ సెక్యూరిటీగార్డు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. తొర్రూర్ గ్రామంలో నివాసముండే లోగిశ సుధీర్ (30) గతేడాదిగా బాటసింగారం పంచాయతీ పరిధి కొత్తగూడెంలోని లాజిస్టిక్ పార్కులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 11న ఉదయం 7గంటలకు విధులకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన సుధీర్ తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. సుధీర్ తండ్రి త్రినాథ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.